క్లుప్తంగా

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు



అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

దొరవారిసత్రం : స్థానిక పీహెచ్‌సీలో గురువారం నవజీవన్ ఆర్గనైజేషన్, సీసీపీయూ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి ఎయిడ్స్, హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుఖ వ్యాధులు, చికిత్స, కండోమ్స్, క్షయ గురించి వివరించారు. అనంతరం డీవీ సత్రం, ఏకొల్లు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ బాలాజీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గౌడ సంఘం సమావేశం



సమావేశమైన గౌడ సంఘం నాయకులు

కోట : విద్యానగర్‌లోని వైఎస్సార్ సీపీ నాయకుడు నరమాల వెంకటరమణయ్య నివాసంలో గురువారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన గౌడ సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘాన్ని బలోపేతం చేయడంపై చర్చించారు. గౌడలు చైతన్యవంతులై ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా ఈ నెల 29న తిరుపతిలో జరిగే గౌడ సంఘం సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. గూడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. భాస్కర్‌గౌడ్, చంద్రశేఖర్, వెంకయ్య పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న నాయకులు

దొరవారిసత్రం : కుప్పారెడ్డిపాళెం గ్రామ సమీపంలో ఉన్న మహెర్ నిరాశ్రయుల ఆశ్రమంలో ఉన్న అనాథలకు గురువారం అన్నదానం చేశారు. టీడీపీ తిరుపతి పార్లమెంట్ జనరల్ కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అన్నదానం చేసినట్టు స్థానిక నాయకులు తెలిపారు. శ్రీనివాసులురెడ్డి, హరి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఖోఖో పోటీలకు నారాయణ విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చిల్లకూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అండర్-17 ఖోఖో పోటీల్లో నారాయణ విద్యా సంస్థల విద్యార్థిని జయంతి ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తెలిపారు. ఆయన గురువారం విద్యార్థినిని జయంతి, పీఈటీ చైతన్యను అభినందించారు. ఏజీఎం శ్రీధర్‌కుమార్, కోఆర్డినేటర్ రఘురాం, ఎం.పద్మయ్య, ఏడీ భవాని పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణులకు ఫల సరుకులు అందజేత



గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని పేద బ్రాహ్మణులకు గురువారం ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో పల సరుకులు అందజేశారు. సంఘం ఉపాధ్యక్షుడు అనిమెళ్ల శివకుమార్ మాట్లాడుతూ మహాలయ అమావాస్యను పురస్కరించుకుని పేద బ్రాహ్మణులకు ఫల సరుకులు అందించేందుకు శ్రీకారం చుట్టామన్నారు. వాటిని నెల్లూరుకు చెందిన ఆలూరి శిరోమణి శర్మ, గూడూరు విశ్రాంత పోస్టల్ సూపరింటెండెంట్ కనుమల సుబ్బారావు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో మైపాడు రాజా, సీహెచ్ శ్రీనివాసరావు, పురుషోత్తంరావు, వెంకటేశ్వరరావు, దువ్వూరు రవీంద్రరెడ్డి, బీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రక్త దానం సామాజిక బాధ్యత

గూడూరు రూరల్ : రక్త దానం సామాజిక బాధ్యతని, యువత రక్తదానం చేయాలని డాక్టర్ కోటా సునీల్‌కుమార్ స్వామిజీ తెలిపారు. ప్రధాని మోదీ పుట్టిన రోజు సందర్భంగా గురువారం బీజేవైఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రక్తం దొరక్క ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. యువత ముందుకు వచ్చి రక్త దానం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం తిరుపతి జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, బీజేవైఎం అధికార ప్రతినిధి గిద్దలూరు మనోజ్‌కుమార్, పురుషోత్తం, కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రణయ్, కార్తీక్, బాలాజీ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి పూల ప్రతిమ



పూలదండ తీసుకెళుతున్న రాజా కుటుంబ సభ్యులు



సారె తీసుకెళుతున్న ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి



కలెక్టర్‌ను ఆశీర్వదిస్తున్న వేదపండితుడు





కొలువైన పోలేరమ్మ



అమ్మవారిని దర్శించుకుంటున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి





పూలదండతో మహిళ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అంగరంగ వైభవం

- జన సంద్రంగా మారిన వెంకటగిరి
- ఘనంగా ముగిసిన పోలేరమ్మ జాతర

సైదాపురం/వెంకటగిరి రూరల్: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర గురువారం అంగరంగ వైభవంగా ముగిసింది. పోలేరమ్మ మెట్టినిల్లు అయిన రజకుల ఇంటి నుంచి గురువారం తెల్లవారుజామున పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసి చలువ పందిరి మండపం వద్ద నిలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని రథంపై కొలువుదీర్చి నగరోత్సవం చేపట్టారు. పోలేరమ్మ రాజావీధి, కాశీపేట సెంటర్, పాత శివాలయం వీధి మీదుగా మల్లమ్మగుడి ప్రాంతం అమ్మవారి నిష్క్రమణ మండపం చేరుకున్నారు. అక్కడ నిష్క్రమణతో జాతర ముగిసింది. అమ్మను దర్శించుకునేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో మిద్దెల మీదకు చేరుకున్నారు. తిరుపతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాలతోపాటు తమిళనాడులోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో వెంకటగిరి జనసంద్రంగా మారింది. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఎస్పీ సుబ్బరాయుడు జాతరను పర్యవేక్షించారు. ఈ ఏడాది రూ.100, రూ.300 టికెట్ల క్యూలు ఏర్పాటుచేయడంతోపాటు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో సామాన్య భక్తులు సులభంగా అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు, అమ్మవారి ప్రసాదం పంపిణీ చేశారు. వెంకటగిరి సీఐ ఏవీ రమణ, ఎస్‌ఐ సుబ్బారావు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.



అమ్మవారికి హారతి పడుతున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో వెళుతున్న భక్తులు



నెత్తిన కుండతో మహిళ



అమ్మవారి నగరోత్సవంలో భక్తులు

చెత్త నుంచి సంపద తయారీపై దృష్టి పెట్టండి

చిల్లకూరు : గ్రామీణ ప్రాంతాల్లో చెత్త నుంచి సంపద తయారీపై దృష్టి సారించి పంచాయతీలకు ఆదాయం పెంపొందించుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ తెలిపారు. ఆయన గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ గతంలో నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం కొత్తగా పక్కా ఇల్లు మంజూరు చేయనుందని, గతంలో ఇచ్చిన పక్కా ఇళ్ల నిర్మించుకోని లబ్ధిదారుల వద్దకు వెళ్లి త్వరగా నిర్మాణం పూర్తి చేసేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ మాణిక్యం, హౌసింగ్ ఏఈలు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

నాయుడుపేట టౌన్ : ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు కోరారు. వారు గురువారం ఓజిలిలో ఉన్న లిక్కర్ డిపో ఇన్‌చార్జి మేనేజర్ నాగ ప్రణీత్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం మద్యం దుకాణాలను రద్దు చేసి ప్రైవేటుకు ఇస్తుండడంతో ప్రభుత్వ దుకాణాల్లో పనిచేస్తున్న తాము వీధిన పడతామన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించేలా చూడాలని కోరారు. నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు, వాకాడు సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.



లిక్కర్ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పాస్టర్స్ ఫెలోషిప్ ప్లీనరీ

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని బేరిపేటలో ఉన్న సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చి ఆవరణలో గురువారం నాయుడుపేట డివిజన్‌లో ఉన్న చర్చిల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రథమ ప్లీనరీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలు వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్ఎం వినయ్‌కుమార్, అధ్యక్షుడిగా ఓ మైకేల్ బెన్‌హర్, ఉపాధ్యక్షుడిగా శరత్‌బాబు, సెక్రటరీగా ప్రేమ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా సురేష్ పాల్, ట్రెజరర్‌గా మురళీధర్, సలహాదారులుగా ఏసుపాదం, జోసెఫ్ రాజు, సూరిబాబు, కార్యవర్గ సభ్యులుగా శామ్యూల్, ఐజాక్ ఎన్నికయ్యారు.



ప్లీనరీలో పాల్గొన్న సంఘం నాయకులు, పాస్టర్లు, పెద్దలు

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

నాయుడుపేట టౌన్ : నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని మునిరత్నం నగర్‌లో గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ అధ్యక్షతన ప్రజావేదిక నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతం చేపట్టారు. వారికి పౌష్టిక ఆహారాన్ని పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మునిరత్నం నగర్‌లో హిందూ శ్మశానవాటిక అభివృద్ధి, మున్సిపాలిటీ స్థలంలో ప్రహరీ గోడ నిర్మాణానికి కృషి చేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. గ్రామ దేవత అల్లెమ్మ ఆలయం అభివృద్ధికి స్థానికుడు జీ మంత్రి అనే వ్యక్తి ఇచ్చిన రూ.10 వేలను ఎమ్మెల్యే ఆలయ నిర్వాహకులకు ఇచ్చారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, నాయకులు ఎస్ విజయభాస్కర్ రెడ్డి, యూ ప్రవీణ్, నెలవల రాజేష్, పార్థు, సన్నారెడ్డి చంద్ర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా తదితరులు పాల్గొన్నారు.



సీమంతం చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, సీడీపీవో

మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విజయ్ కుమార్

వాకాడు : మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వాకాడు గ్రామానికి చెందిన దామా విజయ్‌కుమార్‌ను ఎంపిక చేస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎంఎల్ రాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. దళితుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు.



నృసింహుని సేవలో మంత్రి ఆనం

రాపూరు: పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని గురువారం రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు, సిబ్బంది సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, వేదపండితుల ఆశీర్వచనాలు ఇప్పించారు.

మన ఇళ్లు- మన గౌరవంపై అవగాహన

దొరవారిసత్రం : మండల హౌసింగ్ ప్రత్యేక అధికారి అనిత గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో మన ఇళ్లు- మన గౌరవం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గృహ లబ్ధిదారుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నా, కొత్త ఇళ్ల అవసరం ఉన్నా ప్రత్యేక అధికారులు గుర్తించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీవో రఘురామయ్య, ఏఈ మోహన్‌రావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌ను పరిశీలించిన న్యాక్ కమిటీ

కోట : విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలను గురువారం న్యాక్ కమిటీ బృందం పరిశీలించినట్లు ప్రిన్సిపాల్ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. కళాశాలకు నాలుగో సారి న్యాక్ అక్రిడిటేషన్ మంజూరులో భాగంగా కమిటీ సభ్యులు అన్ని విభాగాలను పరిశీలించారు. ఎంసీ దిలీప్‌కుమార్, శ్రీ శంకరాచార్య యూనివర్సిటీ కేరళ వైస్ చాన్సలర్ ఆధ్వర్యంలోని కమిటీ సభ్యులు కళాశాలలోని భవనాలు, ల్యాబ్, లైబ్రరీ సదుపాయం, ఫ్యాకల్టీ, స్పోర్ట్స్ క్లబ్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీపై క్షుణ్ణంగా పరిశీలించారు. కళాశాల కోఆర్డినేటర్ రాజేష్, గాది శ్రీనివాస్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ బదిలీ

కోట: కోటలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ప్రవీణదేవి నెల్లూరుకు బదిలీ అయ్యారు.ఆమె స్థానంలో ఒంగోలులో పనిచేస్తున్న సుబ్రమణ్యంను నియమించారు. సబ్ రిజిస్ట్రార్ ప్రవీణదేవిని గురువారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

కోట: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన కొత్తపాళెం గ్రామానికి చెందిన కె.శివ(35) నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. అప్పుల బాధతో ఈ నెల 21న శివ పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతన్ని నెల్లూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి వెంకటసుబ్బయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపల్ కమిషనర్‌గా షేక్ ఫజులుల్లా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సెక్రటరీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయనకు కమిషనర్ జనార్దన్ రెడ్డి బాధ్యతలు అప్పగించారు. జనార్దన్‌రెడ్డి పంచాయతీరాజ్ శాఖకు బదిలీపై వెళుతున్నారు. కొత్త కమిషనర్‌ను మున్సిపల్ మేనేజర్ ఎంకే ఖాజామొహిద్దీన్, సిబ్బంది అభినందించారు.



కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న పాత కమిషనర్ జనార్దన్ రెడ్డి

వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎంపిక

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గురువారం వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. స్టేడియంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వందలాది మంది వాకింగ్ చేస్తున్నారు. వారికి సరైన వసతులు కల్పించే క్రమంలో గతంలో వాకర్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల క్లబ్ కొంత వెనక బడి ఉండడంతో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసి స్టేడియం అభివృద్ధికి కృషి చేయాలని భావించారు. ఈ క్రమంలో జరిగిన నూతన కార్యవర్గ ఎంపికలో జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్‌ను అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ స్టేడియంలో వాకర్స్‌తో పాటు జిమ్ ఆలనా పాలన చూడడం, వసతులు కల్పించడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా మస్తాన్‌నాయుడు, వసంత్‌కుమార్, పీకే ఎస్ శర్మ, క్రిష్ణయ్య, సేగు వెంకటేశ్వర్లు, విజయకుమార్, బాషా, సురేష్, పార్థయ్య తదితరులు ఎంపికైనారు.



వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

గూడూరు రూరల్ : విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకే క్రీడా సామగ్రిని అందజేస్తున్నట్టు కృపా సేవా చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి దోనిపర్తి దామోదర రావు తెలిపారు. దోనిపర్తి జయంతిని పురస్కరించుకుని గురువారం గూడూరులోని షాదీ మంజిల్ సమీపంలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేశారు. ట్రస్టు అధ్యక్షుడు కటకం శ్రీనివాసులు, ప్రతినిధులు చెంచయ్య, మంజిరి గోపాల్, రఫీ, సురేంద్రబాబు, నరసింహులు, ఉపాధ్యాయులు, లక్ష్మీ ప్రసన్న, లలితమ్మ పాల్గొన్నారు.



క్రీడా సామగ్రి అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

విద్యా సామగ్రి పంపిణీ

వాలయానందపురంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంఈవో సనత్‌కుమార్ విద్యా సామగ్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆదిశంకరాచార్య బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గ సభ్యులు కొండా మధుసూదన్‌రావు జ్ఞాపకార్థం విద్యార్థులకు విద్యా సామగ్రిని అందిస్తున్నట్లు తెలిపారు. సంఘం సభ్యులు ఎస్వీ శ్రావణకుమార్, నారాయణ, పవన్‌కుమార్, బాలాజీ, కాశీ విశ్వేశ్వరశర్మ, జనార్దన్ పాల్గొన్నారు.

గ్యాస్ పైపులైన్ పనుల అడ్డగింత

నాయుడుపేట టౌన్: పట్టణంలోని రామకృష్ణాపురం వద్ద గ్యాస్ పైపులైన్ కోసం కొత్తగా వేసిన సిమెంట్ రోడ్డును ధ్వంసం చేయడాన్ని కౌన్సిలర్ పాపాడి చంద్రారెడ్డి అడ్డుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో అనేక చోట్ల రోడ్డును పగులగొట్టి పైపులైన్ వేశారు. అనంతరం రోడ్డుకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయలేదు. దీంతో రోడ్లు గుంతలమయం కావడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు కాంట్రాక్టర్‌ను పిలిపించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని సూచించారు. అలా చేయకుండా రోడ్డును తవ్వేయడంపై కౌన్సిలర్ అడ్డుకున్నారు.



పనులను అడ్డుకుంటున్న కౌన్సిలర్ చంద్రారెడ్డి

మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

కోట: మండలంలోని ఉత్తమ నెల్లూరు చెరువు నుంచి మట్టి తరలింపును గురువారం గ్రామస్తులు అడ్డుకున్నారు. అధికార పార్టీ నాయకులు జేసీబీలు తీసుకుని చెరువు వద్దకు చేరుకున్నారు. మట్టిని తవ్వి ట్రాక్టర్లలో తరలించేందుకు సిద్ధం చేస్తుండగా విషయం తెలుసుకున్న గ్రామస్తులు, చెరువు ఆయకట్టు రైతులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు, టీడీపీ నాయకులకు మధ్య వివాదం చోటుచేసుకుంది. గ్రామస్తులు పోలీసులు, అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు మట్టి తవ్వకాలను నిలుపుదల చేయించారు.